

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 109 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 20, మార్చి 2026 | పేజీలు 5 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్










# దళిత ఎమ్మెల్యేపై దాడి !

- ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి రాళ్ళ దాడి చేశారు
- ఇదంతా శాంతి భద్రతలను రక్షించాల్సిన కేంద్ర సహాయక మంత్రి పుణ్యమే
- దళితులు రాజకీయాల్లో కూడా నలిగిపోవాల్సిందేనా
- కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ భూతు పురాణాలు సోషల్ మీడియాలో పుష్కలంగా కలవు
- అంబర్ రాజకీయాల దాడి ఇంకెంత కాలం
- తంబాకు రాజకీయాలను తన్ని తరిమేయాలి
- దాడిలో దేవుని జపిస్తున్నారు ఇది ఎక్కడి సంస్కారమో
- దేవుడు దాడులు చేయమనడు ఇతరులను ఆదుకోమంటాడు
- తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చారు
- దళిత ఎమ్మెల్యే ఇంటిపై అంతటి దాడి చేస్తే కాంగ్రెస్ పార్టీ కండ్లు మూసుకుంటుందా
- డాక్టర్ బరిగెల శివ







డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

యధా రాజా తదా ప్రజా అన్నట్లుగా ప్రస్తుత రాజకీయాలు నడుస్తున్నాయని డాక్టర్ బరిగెల శివ సంచలనమైన వాక్యాలు చేశారు.కేంద్ర ప్రభుత్వం దేశంలో దళితుల పట్ల దళిత క్రిస్టియన్ల పట్ల మైనార్టీల పట్ల ఏ విధమైనటువంటి అణిచివేత ధోరణిని ప్రదర్శిస్తుందో ఎలాంటి దాడులను ప్రేరేపిస్తూ పురి కోల్పోతుందో అచ్చం అలాగే తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని అందులో భాగంగానే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ ఇంటిపై కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ అనుచరులు రాళ్ల దాడికి పాల్పడినారని తీవ్రంగా హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుండగా దళితుడైన ఎమ్మెల్యే ఇంటిపై బిజెపికి చెందిన మంత్రి అనుచరులు దాడి చేయడం దళిత జాతిని తీవ్రంగా అవమానపరచందన్నారు. వాస్తవాలు ప్రస్తావించాల్సి వస్తే కేంద్రం సహాయక మంత్రి బండి సంజయ్ బూతు పురాణం సోషల్ మీడియాలో పుష్కలంగా కలవని వాటన్నిటిని బయట పెట్టాల్సి వచ్చినప్పుడు బండి సంజయ్ ఇంటిపై ఎన్నిసార్లు దాడులు చేయాల్సి వచ్చేదో అతనే చెప్పాలన్నారు.మాజీ మంత్రి కేసీఆర్ పై తాగుబోతు అంటూ భూతులు తిట్టడమే కాకుండా పది

- మిగతా 2లో..

## చిట్టక్క రాజకీయ అరంగేట్రం !

పరకాల వైపు చిట్టక్క చూపు
ప్రజాసేవకు పరితపిస్తున్న కొండా దంపతుల వారసురాలు
రాజకీయంలో ఒక్కసారిగా ఘాటు వ్యాఖ్యలతో వెలుగులోకి వచ్చిన చిట్టక్క
తల్లిదండ్రుల సేవలో తన పాత్రను తనదైన ముద్రను మలుచుకుంటున్నారు
కొండా సుస్మితక్క రాజకీయం ప్రజలకు కొండంత అండగా నిలవాలి
ముక్కు సూటిగా రాజకీయాలు చేస్తేనే ప్రజల్లో నిలదొక్కుకోగలం
కొండా దంపతుల దీవెనలు ప్రజల ఆశీర్వాదాలు చిట్టక్క రాజకీయలకు పునాదులు

2



## తెలంగాణ సీఎస్ పదవీకాలం మరోసారి పొడిగింపు

రేవంత్ సర్కార్ విన్నపానికి కేంద్రం ఆమోదం!



2

## ఆ విషయంలో హీరో సూర్య నుంచి స్ఫూర్తి పొందాను


మరో సేవా కార్యక్రమం చేపడతానన్న చిరంజీవి

4

## అకాల వర్షాల కల్లోలం

తెలుగు రాష్ట్రాల్లో
పిడుగుపాటుకు
నలుగురి బలి

4



## ఉగాది వేళ రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద రూ.18,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రుణభారంతో ఉన్న రైతులకు పెద్ద ఊరటనిస్తూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దేశంలోనే అత్యంత తక్కువ రుణభారం ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన భూ యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దాని స్థానంలో 'భూ భారతి'ని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# చిట్టక్క రాజకీయ అరంగేట్రం !

**పరకాల వైపు చిట్టక్క చూపు**
**ప్రజాసేవకు పరితపిస్తున్న కొండా దంపతుల వారసురాలు**
**రాజకీయంలో ఒక్కసారిగా ఘాటు వ్యాఖ్యలతో వెలుగులోకి వచ్చిన చిట్టక్క**
**తల్లిదండ్రుల సేవలో తన పాత్రను తనదైన ముద్రను మలుచుకుంటున్నారు**
**కొండా సుస్మితక్క రాజకీయం ప్రజలకు కొండంత అండగా నిలవాలి**
**ముక్కు సూటిగా రాజకీయాలు చేస్తేనే ప్రజల్లో నిలదొక్కుకోగలం**
**కొండా దంపతుల దీవెనలు ప్రజల ఆశీర్వాదాలు చిట్టక్క రాజకీయలకు పునాదులు**

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**



ఉమ్మడి తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో పరిణతి కలిగిన ప్రజాసేవకు అప్తులైన రాజకీయ ప్రజా సేవకులుగా వరంగల్ ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ,పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఎంతటి సుపరిచితుల్లో తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఎలాంటి క్లిష్ట సందర్భంలోనైనా పేద ప్రజలకు అండగా నిలవాలన్న, పేద ప్రజలను ఆదుకోవాలన్నా కొండా దంపతుల తర్వాతనే ఎవరన్నా అనేది ప్రజల్లో బలంగా నాటుకు పోయినదనేది మాట వాస్తవం.అలాంటి కుటుంబంలో కొండా దంపతులకు వరంలాగా లభించిన ఏకైక పుత్రిక కొండా సుస్మిత పటేల్ (చిట్టక్క) రాజకీయ రంగ ప్రవేశంపై ఎన్నో సందర్భాల్లో పలు చర్చలుగా వెలుగులోకి వచ్చినప్పటికీ రాజకీయ పరిణామాలను, రాజకీయ వాతావరణాలను దృష్టిలో పెట్టుకొని చిట్టక్క రాజకీయ భవిష్యత్తును ప్రజలకు అంకితం చేయాలనే విధంగా కొండా దంపతులు భావిస్తూ ఆశిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. కొండా దంపతుల వారసురాలు కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొండా సుస్మిత పటేల్ రాజకీయ ప్రవేశంపై ఇటు ప్రజల్లో బడుగు, బలహీన వర్గాల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి. రాజకీయ పరిణామాలను బేరీజు చేస్తూ రాజకీయ పరిస్థితులను అంచనా వేయడంలో కొండా దంపతుల ప్రత్యేకతే వేరనే పునాదులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాతుకుపోయి ఉన్నాయి. ప్రస్తుత రాజకీయాల్లో నిజాయితీగా నిలబడగలిగితే ఎంతటి దుర్మార్గమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో, ఎంతటి రాజకీయ అరాచక శక్తులను తట్టుకొని నిలబడాల్సివస్తుందో కొండా సుస్మిత పటేల్ తన తల్లి పట్ల జరుగుతున్న అవమాన భారాలను దగ్గరుండి చూస్తూ తన తల్లిదండ్రులకు రాజకీయ పరంగానే కాకుండా కుటుంబ పరంగానే కాకుండా ప్రజాసేవలో సహకారంగా ఉండాలని భావించిన నేపథ్యంలో ఎలాగైనా రాజకీయాల్లో ప్రవేశించి తన తల్లిదండ్రులు దీర్ఘకాలంగా చేస్తున్న ప్రజాసేవను ఒడిసి పట్టుకొని కొనసాగించాలని బలమైన తపనతో తన మనసులోని రాజకీయ భావాలను తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వచ్చే ఎన్నికలలోపు కొండా సుస్మిత పటేల్ రాజకీయ ప్రవేశానికి పునాదులు వేస్తూ రాజకీయ జీవితాన్ని బలపరచడం కోసం ఎవరికి తోచని విధంగా రహస్య ప్రణాళికలను కొండ దంపతులు సిద్ధం చేసుకున్నట్లు కొండా యువసేన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు. కొండ కుటుంబం అంటేనే ప్రజాసేవకు దాసోహం అనే విధంగా సుదీర్ఘ కాలం పాటు జరిగిన రాజకీయ సేవలను తన కూతురి రూపంలో ఏర్పాటు చేసుకొని బలపరచుకొని నిరూపించుకోవాలని కొండా దంపతులు తహతహలాడుతున్నారు. మరోవైపు కొండా దంపతులకు దీటుగా ప్రజాసేవ చేయగల మనోధైర్యం గుండెధైర్యం సత్తాతో కూడిన పరిజ్ఞానం అన్నింటికీ మించి రాజకీయ పరిణామాలను అంచనా వేస్తూ పరిస్థితులకు అనుకూలంగా నడుచుకోగల చతురత చిట్టక్కకు పుష్కలంగా ఉన్నాయని కొండా దంపతుల అభిమానులు బలంగా విశ్వసిస్తున్నారు. చిట్టక్క రావాలి ప్రజాసేవ చేయాలంటూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు కొండా దంపతుల ఏకైక పుత్రిక రాజకీయ ప్రవేశంపై స్వాగతం పలుకుతున్నారు.

# వందేమాతరం పాడాల్సిందే..

**ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్**

**కరీంనగర్, జై భీమ్ న్యూస్**



అసెంబ్లీలో వందేమాతరం ఆలపించే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా జాతీయ గీతాన్ని గౌరవించి, వందేమాతరం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే వందేమాతరం గానాన్ని తప్పనిసరి చేస్తుందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐఎం నేతల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' వ్యాఖ్యల వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత రహస్యంగా మరో పార్టీతో సమావేశమైనందునే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని, ఈ బాధ్యతను రాహుల్ గాంధీ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి అప్పగించారని సంచలన ఆరోపణలు చేశారు. రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసాతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ, గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తామని, అయితే పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని చెబుతూ, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యాసంస్థల్లో ఉగ్రవాద మూలాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# దళిత ఎమ్మెల్యే 'పై' దాడి

మొదటి పేజీ తరువాయి

సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీని విపరీతమైన ఘాతులతో రెచ్చిపోయినప్పుడు మాజీ ముఖ్యమంత్రి తన రాజకీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి పత్రిక సమావేశంలో ఘాటుగా స్పందిస్తూ సమాధానం ఇచ్చారే తప్ప దాడులు చేయమని ఎక్కడ చెప్పలేదన్నారు.రాజకీయాల్లో అధిపత్యం చెలాయించడం కోసం ప్రజాసేవలో పోటీపడుతూ ప్రజల చేత మెప్పులు పొంది రాజకీయ జీవితాన్ని అభివృద్ధి పరచుకోవాలి కానీ అంబర్ రాజకీయాలకు ప్రణాళికలు వేసుకొని తంబాకు రాజకీయాలను ప్రభావితం చేయునట్లుగా దళితులైన ఎమ్మెల్యేల దాడులు చేస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రతి ఒక్కడు దళితులనే టార్గెట్ చేసుకుంటూ పోతే నాయకులు అంతా బ్రతికి బట్ట కట్టగలరా అంటూ తీవ్రంగా హెచ్చరించారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగంగా రిజర్వేషన్స్ స్థానంలో 2023 లో కాంగ్రెస్ పార్టీ తరపున తుంగతుర్తి లో పోటీలో నిలిచిన మందుల సామ్యూల్ శాసనసభ్యులు గెలిచినది మొదలుకొని ప్రజాసేవలో ముందుకు సాగుతున్నారని రిజర్వేషన్ల ద్వారా కల్పించబడిన శాసనసభ స్థానాలు గాని లోక్సభ స్థానాల్లో గాని రిజర్వేషన్ ఫలాలు అనుభవించాల్సిన షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలకు మాత్రమే సేవలందించడానికి అవకాశాలుగా మలుచుకోవాల్సి ఉంటుండగా సామ్యూల్ పై అకారణమైన దాడికి పురికొల్పిన నాయకులతో పాటు దాడి చేసిన వాళ్లపై ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోలేకపోవడం జరిగిన దాడిని సహకరించినట్లుగానే ఉందన్నారు.కేవలం తూ తూ మంత్రంగా చర్యలు తీసుకుంటే సరిపోదని ఒక దళిత శాసనసభ్యునికి రక్షణ లేకపోతే సాధారణ ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన రక్షణ కల్పిస్తాయని గుర్తు చేశారు.నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్థాయి లాంటి నాయకులు ఎన్నోసార్లు అదుపుతప్పి మాట్లాడుతున్నారని అలాంటి సందర్భాలను పురస్కరించుకొని ముఖ్యమంత్రిల ఇండ్లపై దాడులు చేసే దమ్ముందా అంటూ బండి సంజయ్ కి సవాల్ విసిరారు.ఎమ్మెల్యే మాట్లాడింది తప్పనిపిస్తే పత్రికాముఖంగా ఖండించాలి గాని ఎమ్మెల్యే మాట్లాడిన సందర్భంలోనే వాస్తవ అవాస్తవాలు తెలుసుకోకుండా ఇండ్లపై దాడి చేయడం ఏందంటూ సూటిగా నిలదీశారు.కేంద్ర అధికార పదవి బలుపు దళిత ఎమ్మెల్యేల మీద కాదని అలాంటి రుబాబు అగ్రవర్ణాల మీద చేసి చూపిస్తే ఆమాత్రం కాస్త గొప్పతనం బయటపడుద్దన్నారు.రాష్ట్రంలో మొలతాడు రాజకీయాలు చిల్లరగాల్లను తయారు చేస్తున్నాయని దాడిలో కూడా దేవుని జపిస్తూ రాళ్లు రువ్వడం దేశంలో ఎక్కడ చూడలేదు అన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్ని నిధులు తెచ్చావో శ్వేత పత్రం విడుదల చేయ అంటూ సవాలు విసిరారు.అదే సందర్భంలో రాష్ట్రం నుండి కేంద్రం ఎన్ని నిధులు తీసుకుందో దానిపై కూడా శ్వేతపత్రం విడుదల చేసి మంత్రి రాజకీయ నిజాయితీని చూపించాలని దళితులు డిమాండ్ చేస్తున్నారన్నారు.ఈ రకంగా చూస్తుండగా బిజెపి దళితులను బతకనివ్వదంటూ మదనపడ్డారు.దళిత ఎమ్మెల్యే ఇంటిపై అంతటి రాళ్ల దాడి చేస్తే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా కండ్లు మూసుకున్నట్లుగా ఉందని కనీసం దాడిని ఖండించే పరిస్థితి లేదంటే కాంగ్రెస్ పార్టీలో దళితుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. పేదల ఉసురు పోసుకుంటున్న బిజెపికి ప్రజలే బుద్ధి చెప్పాలంటూ పేర్కొన్నారు.ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని అధికారంలోనికి వచ్చినంత మాత్రాన ప్రజలను అణిచివేయడం దళితులపై దాడులు చేయడం ఎమ్మెల్యేల ఇండ్లపై రాళ్లురువడం హక్కు లాగా భావిస్తే షెడ్యూల్ కులాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.ప్రజలను మతాల ఊబిలోనికి లాగడం అసలు ఇదెక్కడి దైవభక్తి అంటూ నిజమైన దైవభక్తి అంటే ఏంటో తెలుసుకోవాలని కేంద్ర సహాయక మంత్రికి చురకలు వేశారు.దేవుళ్ల పేరు చెబుతూ దాడులు చేయడం నీచమైన రాజకీయమని పసిఘట్టాలన్నారు.మంత్రి బండి సంజయ్ దళితుల రుచులు ఎట్లా ఉంటాయో చూస్తావా అంటూ హెచ్చరించారు.అధికార బలుపుతో దళితుల జోలికొస్తే పరిణామాలు ఊహించని విధంగా ఉంటాయని హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు, కరీంనగర్ ప్రజలు రాజకీయ పదవిని కట్టబెట్టింది కేంద్ర సహాయక మంత్రి హోదా కల్పించింది కేవలం ప్రజలకు సేవ చేయడానికి తప్ప దళితుల ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులు చేయడానికి దాడులను పూడికోల్పడానికి కాదని గుర్తు చేశారు కేంద్రం ముందు మోకరిల్లేది కేవలం పదవుల కోసమేనా తెలంగాణ రాష్ట్రానికి ఏమైనా ఒరగబెట్టింది ఉందా అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. 12 సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్ర పాలన అభివృద్ధికి సహకరించింది చెప్పమంటే మొలతాడు కట్టుకుంటాం పౌరుషం ఉంటుందంటూ ప్రజలను రెచ్చగొడుతున్నావు ప్రజాసేవ అంటే ఏమిటో మొదట తెలుసుకోవాలని తెలియజేశారు.గత బిఆర్ఎస్ హయాంలో 10 సంవత్సరాల కాలంలో బిజెపి నాయకులు కుక్కినట్లుగా ఉన్నారని కేంద్రంలో బద్ధ శత్రువులైన కాంగ్రెస్ బిజెపిలు దేశ రాజకీయాల్లో అధికార ప్రతిపక్ష హోదాలో కొనసాగుతుండగా రాష్ట్రంలో బిజెపి ఆగడాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నట్లుగా బిజెపి చేస్తున్న దాడుల పట్ల పూర్తిగా సమ్మతిస్తున్నట్లు రెండున్నర సంవత్సరాలలో జరిగిన దాడుల విశ్వరూపం తెలియజేస్తుందన్నారు.శాంతిభద్రతలను రక్షించాల్సిన నాయకులే గొప్ప గొప్ప పదవుల్లో ఉంటూ శాంతి భద్రతలకు విఘాతాలు కలిగిస్తూ ఇండ్లపై దాడులను చేయించే దుర్బుద్ధి కలిగిన ఆలోచనలను సామాన్య ప్రజలచే ప్రేరేపిస్తున్నారంటే ప్రజాస్వామ్య విలువలను ఎంతగా అవమాన పరుస్తున్నారో ఒక్కసారిగా గుర్తుకు చేసుకోవాలన్నారు.అన్ని అధికార పదవులను అనుభవించుకుంటూనే రాజ్యాంగ ఫలితంగా వచ్చిన పదవుల్లో కూడా దళితులను నిలదొక్కుకో లేకుండా చేస్తే రాజకీయాలకు విలువ ఎలా ఇస్తారంటూ సూటిగా ప్రశ్నించారు.భగవంతుని మీద ప్రమాణాలు చేస్తూ ప్రతిరోజు మందిరాల్లో పూజలు చేసుకుంటూ ఇలాంటి కుళ్ళు రాజకీయాలకు ఇలాంటి కుతంత్రాల రాజకీయాలకు ఇలాంటి దాడులకు పాల్పడే రాజకీయాలకు ఇతరులను నాశనం చేయాలనే దుర్బుద్ధి కలిగినటువంటి మనస్తత్వాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రతి రాజకీయ నాయకుడు సిగ్గుతో తలవంచుకొని రాజకీయ సన్యాసం పుచ్చుకోవడం గొప్పదంటూ హితవు పలికారు.తెలుగు రాష్ట్రాల్లో దళితులంతా రాజకీయాలకు అతీతంగా ఒకటవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉచ్చులో పడకుండా హక్కులను కాపాడుకునే విషయంలో ఐకమత్యాన్ని చాటుకోవాల్సిన అవసరం ఉందని కేవలం అవసరాల కోసం స్వార్థాల కోసం పెద్ద పెద్ద నాయకుల చుట్టూ తిరగడం కన్నా రాజ్యాధికార లక్ష్యంగా దళితులపై జరుగుతున్న దాడులను తట్టుకొని ఎదురు దాడులు చేసే స్థాయికి ఎదగాలని చట్టం బలవంతునికి ఒకరకంగా బలహీనునికి ఒక రకంగా ఉండదని తప్పులకు పాల్పడుతున్న మంత్రులైన అధికారులైన ప్రజలైన చట్టం ముందు న్యాయస్థానాల ముందు సమానమేనని గుర్తెరగాలన్నారు.ఇకపై దళితులపై గాని దళితుల వాళ్ళ ఇండ్లపై గాని దాడులు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.ఇలాంటి దాడులను ప్రభుత్వమే పూర్తిగా నియంత్రించాలని దళితుడైన ఎమ్మెల్యేకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తూ దాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరైతే ఉన్నారో దాడిని పురికొల్పిన వ్యక్తులు ఎవరైతే ఉన్నారో వాళ్లపై ప్రభుత్వ పరంగా అధికార పరంగా షెడ్యూల్ కులాలకు చెందిన చట్టాల పరంగా కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు.సహచర ఎంపీలు ఈటల రాజేందర్,ధర్మపురి అరవింద్ లాంటి నిజాయితీ కలిగిన రాజకీయాల నిజాయితీ కలిగిన ప్రజా సేవలను పాటించాలని తెలియజేస్తూ మంచిని మంచి చెడును చెడు అనడంలో ఎక్కడ వెనకాడ బోమని ఇకనైనా ప్రజాసేవలో పూర్తి సమయం కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన నిధులను తెప్పిస్తూ సహాయపడాలని తెలిపారు.

## నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు. తన రాజకీయ ప్రయాణం స్వతంత్రంగా ఉంటుందని, ఎవరికీ అడ్వాంటేజ్‌గా మారబోనని ఆమె స్పష్టం చేశారు. "మంచి ముహూర్తం చూసుకుని పార్టీని ప్రారంభిస్తా.. అప్పుడే నా లక్ష్యాలను ప్రజల ముందు ఉంచుతాను" అని ఆమె అన్నారు. మరోవైపు, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు సానుకూల తీర్పునిచ్చింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' (ప్రాజీ) పేరుతో దాఖలైన దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ అధికారిక ప్రకటనకు ఉన్న సాంకేతిక అడ్డంకులు దాదాపు తొలగిపోయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు దుబ్బాక సమీపంలో గండి

**సిద్దిపేట, జై భీమ్ న్యూస్**

సిద్ధిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండిపడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో ఈ కాలువకు గండిపడింది. ఈ కాలువ మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీరు అందిస్తుంది. కాలువకు గండిపడటంతో నీరు వృథాగా చెల్లాపూర్ కందూరు చెరువులోకి వెళుతోంది. సాగర్‌కు గండి పడటంతో కాలువ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గండిపడిన ప్రాంతాన్ని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. అధికారులను కలిసిన రైతులు, కాలువకు త్వరగా మరమ్మతులు చేయాలని లేదంటే పంటలు ఎండిపోతాయని విజ్ఞప్తి చేశారు. కాలువను సాధ్యమైనంత తొందరగా బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. మల్లన్న సాగర్ నుంచి వచ్చే కెనాల్ కాలువ లైనింగ్ పనుల్లో క్వాలిటీ లేకపోవడం వల్ల కాల్వకు గండిపడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



## 'శ్రీ పరాభవ నామ సంవత్సరం'పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపి-వగరు-చేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.



# పార్లమెంట్‌లో మానసిక దివ్యాంగుల సమస్యలపై పోరాటం చేస్తా





**పారిశ్రామిక వ్యాపారవేత్తలు సి.ఎస్.ఆర్ నిధులు సేవా సంస్థలకు మళ్లించాలి.**
**ఫిజికల్, మెంటల్ దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు కోసం శాసనసభలో కృషి చేస్తా**
**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా చిన్నారులకు కొత్త బట్టలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే స్వయంగా పిల్లలకు భోజనం వడ్డించి మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. అదనంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

**25 ఏళ్ల అనుబంధం... నిరంతర సేవ**

మల్లికాంబ మనోవికాస కేంద్రంతో కడియం కుటుంబానికి దాదాపు 25 ఏళ్ల అనుబంధం ఉందని వారు పేర్కొన్నారు. ప్రతి ఏడాది పండుగలు, ప్రత్యేక రోజులు ఇక్కడి చిన్నారుల మధ్య జరుపుకుంటూ బట్టలు, ఆర్థిక సహాయం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు బట్టలు అందజేసి, లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మానసిక దివ్యాంగులపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్ష తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధార్ లింకేజీ సమస్యల కారణంగా పలువురు దివ్యాంగులు పెన్షన్, వైద్య సదుపాయాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆటిజం వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు పెంచాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సేవా సంస్థలకు దాతలు ముందుకు రావాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఉగాది కొత్త ఆరంభాలకు ప్రతీకగా నిలుస్తుందని, సమాజంలోని ప్రతి వర్గం గౌరవంతో జీవించేలా చేయడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఉగాది పచ్చడిలా జీవితం సుఖదుఃఖాల సమ్మేళనమని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని ఎంపీ సూచించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మల్లికాంబ మనోవికాస కేంద్రం సమస్యలను 25 ఏళ్ల క్రితమే తన దృష్టికి తీసుకువచ్చినప్పటి నుంచి ఈ సంస్థకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని తెలిపారు..మానసిక దివ్యాంగ చిన్నారుల కోసం పనిచేసే సంస్థలకు ప్రభుత్వ సహాయం మరింతగా అవసరమని పేర్కొన్నారు. సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పరిశ్రమలు, వ్యాపారవేత్తలు ఇలాంటి సంస్థలకు తోడ్పాటు అందించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దివ్యాంగుల భద్రత, సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని అన్నారు. అలాగే మరిన్ని ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. నేడు ఉగాది సందర్భంగా దాదాపు 200 మంది చిన్నారులకు కొత్త బట్టలు అందజేసి, ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా కడియం ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, మాజీ కార్పొరేటర్ మాధవి, ఎమ్మెల్యే సతీమణి వినయరాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన పెంపుడు ప్రేమ..

**పిల్లి చనిపోయిందని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య!**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రాణంగా పెంచుకుంటున్న పెంపుడు పిల్లి అనారోగ్యంతో మరణించడంతో డిగ్రీ విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆ బాధను తట్టుకోలేక హాస్టల్ గదిలోనే ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉంటూ డిగ్రీ చదువుతున్న ఓ యువతి పిల్లిని పెంచుకుంటోంది. ఇటీవల ఆ పిల్లి అనారోగ్యంతో మరణించింది. అప్పటినుంచి ఆ యువతి డిప్రెషన్ లోకి వెళ్లిపోయింది. ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా గడుపుతోంది. ఈ క్రమంలో బుధవారం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. గదికి తిరిగివచ్చిన తోటి విద్యార్థినులు, ఆమె అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో, పిల్లి చనిపోయిన బాధతోనే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలపై ప్రేమ ఉండటం మంచి విషయమే అయినా, దాని కోసం ప్రాణాలు తీసుకోవడం అత్యంత బాధాకరమని కామెంట్లు పెడుతున్నారు. చిన్న చిన్న కారణాలకే యువత ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వైభవంగా 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' కార్యక్రమం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19, గురువారం సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రత్యేక శోభను తెచ్చారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి తన అర్ధాంగి సురేఖతో కలిసి హాజరుకాగా, కింగ్ నాగార్జున అమలతో విచ్చేశారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, నూతన దంపతులు నాగచైతన్య–శోభిత ధూళిపాళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025లో విడుదలైన చిత్రాలకు గాను పలు విభాగాల్లో అవార్డులు అందించారు. "తండేల్" చిత్రానికి గాను నాగచైతన్య ఉత్తమ నటుడిగా, "ది గర్ల్ ఫ్రెండ్" చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి సాయిలు ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు, అలనాటి నటి జయసుధకు ఏఎన్నార్ ఫిల్మ్ అవార్డు అందజేశారు. సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు వ్యాఖ్యానంతో సాగిన ఈ వేడుకలో నటి నిధి అగర్వాల్ డ్యాన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ డీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమం సినీ పరిశ్రమలో నూతనోత్సాహాన్ని నింపింది.

# స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల బ్రోచర్ ఆవిష్కరణ



**స్టేషన్ ఘనపూర్, 19 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల బ్రోచర్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు వంటి సదుపాయాలు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతున్నాయని చెప్పారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో చేరి మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అదనంగా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, టీఎస్కేసీ ద్వారా ఉద్యోగావకాశాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు మార్గదర్శకత్వం వంటి అనేక సదుపాయాలు ప్రభుత్వం ద్వారా అందుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి, అధ్యాపకులు నాగరాజు, సుమలత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను రాష్ట్ర ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇక, అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు.

# రాహుల్ గాంధీ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని బిజెపి ఎంపీ కంగనా క్షమాపణ చెప్పాలి - ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్ / జై భీమ్ న్యూస్ :**



లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ పై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ ఎంపీగా ఉండి ప్రతిపక్ష నాయకుడిపై అవమానకరమైన రీతిలో అనుచితమైన భాషను ఉపయోగించడాన్ని వారి పార్టీ బీజేపీ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. కంగనా తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కు తీసుకుని రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ప్రజాప్రతినిధులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి కానీ నోరుపారేసుకుని సమాజంలో అప్రతిష్ట మూటకట్టుకోవటం సరికాదని హెచ్చరించారు. కంగనా రనౌత్‌కు వివాదాలు కొత్తకాదని .... ఎంపీ అయ్యాక కూడా తన ప్రవర్తన మార్చుకోకపోవటం దురదృష్టకరం అన్నారు. జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా గారి వ్యాఖ్యలకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆమె అభిప్రాయాలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ పై వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్య విలువలకు హానికరమని చెప్పారు . ఒక మహిళగా, ప్రజాప్రతినిధిగా కంగనా రనౌత్ బాధ్యతగా మాట్లాడాలని, నియంత్రణ పాటించాలని కోరారు. కంగనా తన పద్ధతి మార్చుకోకుంటే మహిళా కాంగ్రెస్ ఆమెకు తగిన బుద్ధిచెబుతుందని హెచ్చరించారు. సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా గారల మార్గనిర్దేశనంలో మహిళా కాంగ్రెస్ గౌరవప్రదమైన రాజకీయాలు చేస్తుందని చెప్పిన స్వర్ణ మా నాయకులపై అవమానకర వ్యాఖ్యలు చేసినవారికి తగిన సమాధానం చెప్పేందుకు వెనకాడమని అన్నారు.

# స్పెషల్ బస్సుల పేరుతో సామాన్యుల జేబులు కత్తిరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆర్టీసీ అదనపు చార్జీలను వెంటనే తగ్గించాలి**
**బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు డిమాండ్**







**ఏటూరునాగారం మార్చి 18: జై భీమ్ న్యూస్**



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందని, ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరుతో భారీగా చార్జీలు పెంచడం అత్యంత దుర్మార్గమని ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రంగా ఖండించారు అదనపు భారం పండుగలు, శుభకార్యాల సమయంలో సాధారణ చార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వం మోయలేని భారం మోపుతోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ద్వంద్వ నీతి ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణం అని చెబుతూనే, మరోవైపు 'స్పెషల్ సర్వీసుల' పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచి సామాన్యుల జేబులు కత్తిరించడం సరైన పద్ధతి కాదు ఆర్టీసీ లాభాల కోసం సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు. పెంచిన అదనపు చార్జీలను ప్రభుత్వం వెంటనే పునరాలోచించి, సాధారణ ధరలకే బస్సులను నడపాలని ఆయన కోరారు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేస్తూసామాన్య ప్రజల పరిస్థితిని అర్థం చేసుకుని,వెంటనే పెంచిన అదనపు చార్జీలను తగ్గించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్.

# లంచాల కేసులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, టీచర్ అరెస్ట్

**రూ.20 లక్షల నగదు స్వాధీనం**

**కరీంనగర్, 19 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**



కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండెటి రాము, ఓబులాపూర్‌కు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్.జి.టి) జక్కని వేణును తెలంగాణ యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ ) అధికారులు అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం, గుండెటి రాము వేములవాడలో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సమయంలో తన స్నేహితుడు, మాజీ సహోద్యోగి అయిన జక్కని వేణుతో కలిసి ఒక బెల్లం వ్యాపారి నుండి 2022 నుంచి 2024 మధ్యకాలంలో యూపీఐ (యూపీఐ) లావాదేవీల రూపంలో నిరంతరం లంచాలు (మామూళ్లు) వసూలు చేసినట్లు గుర్తించారు. ఈ కేసు నేపథ్యంలో రాము నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా, లెక్కల్లో చూపని సుమారు రూ.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం కోరినట్లయితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ (ట్విట్టర్) ఏతెలంగాణఏసీబీ , వెబ్‌సైట్ ఏసీబీ.తెలంగాణ.గౌవ్.ఇన్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ఘనంగా ఎల్. రాజేష్ పుట్టినరోజు వేడుకలు




**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

మహాదేవపుర నియోజకవర్గ బిజెపి నగర మండల్ ప్రధాన కార్యదర్శి రాజేష్ ఎల్ పుట్టినరోజు వేడుకలు మహాదేవపుర నియోజకవర్గ ఎమ్మెల్యే మంజుల లింబావళి, నాయకులు మరియు అభిమానుల సమక్షంలో వైట్‌ఫీల్డ్‌లోని ఇన్నర్ సర్కిల్ గ్రౌండ్‌లో తన పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు కేక్ కట్ చేసి, ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా, పుట్టినరోజు సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ, చీరల పంపిణీ, ఆటో డ్రైవర్లకు యూనిఫాంలు, భోజన ఏర్పాట్లు వంటి అనేక ఇతర సేవలతో కూడిన "ఆరోగ్య శిబిరం" నిర్వహించగా, నియోజకవర్గ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకున్నారు. ఆ తర్వాత ఎల్. రాజేష్ మాట్లాడారు. మాజీ మంత్రి అరవింద్ లింబావళి నా రోల్ మోడల్. ఆయన నాకు చూపించిన దారిలోనే నేను నా పుట్టినరోజును నిరాడంబరంగా జరుపుకుంటూ, ప్రతి సంవత్సరం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. నియోజకవర్గంలో నిరాడంబరమైన, ప్రజాహిత పరిపాలనను నిర్వహిస్తున్న అరవింద్ లింబావళి అభిమానిగా, ఆయన ఆదర్శాలను అనుసరించడం నా కర్తవ్యం. ఈరోజు, ఆయనను ఆదర్శంగా తీసుకుని, మేము ఎమ్మెల్యేల సమక్షంలో పేదలకు కిరాణా సరుకుల కిట్లను అందిస్తున్నాము. దివ్యాంగులకు వీల్‌చైర్లు. చేతికర్రలు, ఆరోగ్య శిబిరం, చీరల పంపిణీ, పిల్లల చదువుకు ప్రోత్సాహం. బీబీఎంపీ పౌర కార్మికులకు కిరాణా సరుకుల కిట్లు, బట్టలు, ఆటో డ్రైవర్లకు బట్టలు, మానసిక వికలాంగులైన పిల్లలకు భోజనం, పండ్లు, కేకులు. ఈ విధంగా నేను అనేక సేవా కార్యక్రమాలను అందిస్తున్నాను. ఇది నా హృదయానికి కూడా ఆనందాన్ని తెచ్చిపెట్టింది, అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అర్బన్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు హూడి పిల్లప్ప, మాజీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, నాయకులు మారెప్ప, హూడి మంజునాథ్ మరియు పెద్ద సంఖ్యలో బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉగాది అందరి జీవితాల్లో ఆనందాలు నింపాలి

కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి



**హన్మకొండ, 19 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాంగ శ్రవణం, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం పండితులు ఐనవోలు సాయి కృష్ణ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించి, వివిధ రాశుల వారికి సంబంధించిన ఫలితాలను వివరించారు. ఆదాయం, వ్యయం, రాజ్యపూజ్యం, అవమానం వంటి అంశాలపై సమగ్రంగా వివరించి, నూతన సంవత్సరంలో పాటించాల్సిన విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, ఉడతల సారంగపాణి, కుసుమ లక్ష్మీ నారాయణ, తండమళ్ళ వేణు, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కన్వీనర్ తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, మిట్టపల్లి రమేష్, కమురున్నీసా తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు చందర్, రవి యాదవ్, శ్రీనివాస్, అనిల్ కుమార్, జానకి రాములు, రఘు, సరస్వతి, రజిత, విజయ్, సదాంత్, ఆర్.కే. నరేంద్ర, తక్కళ్లపల్లి వినీల్ రావు, గుడికందుల వినోద్ కుమార్, సందీప్ యాదవ్, రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.

## అకాల వర్షాల కల్లోలం

తెలుగు రాష్ట్రాల్లో పిడుగుపాటుకు నలుగురి బలి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలుచోట్ల వడగళ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పిడుగుపాటుకు గురై మరణించిన వారిలో తెలంగాణలోని వనపర్తి జిల్లా మేడపల్లికి చెందిన మిరప రైతు రాములు (27), ఏపీలోని బాపట్ల జిల్లా రాచూరుకు చెందిన కౌలురైతు వనజ (35) ఉన్నారు. వీరితో పాటు పల్నాడు జిల్లా కొత్త నాగిరెడ్డిపల్లికి చెందిన కూలీ సుబ్బరత్తమ్మ (55), గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కె.శ్రీనివాసరావు (40) కూడా మృతి చెందారు. ఈ అకాల వర్షం మూగజీవాల పాలిట కూడా శాపంగా మారింది. వికారాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు ఒకేచోట సుమారు 300 మేకలు మృత్యువాత పడ్డాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈదురు గాలుల ధాటికి పలు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న రెండు రోజులు కూడా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. గత 24 గంటల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగావ్‌లో అత్యధికంగా 5.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## తెలంగాణ సీఎస్ పదవీకాలం మరోసారి పొడిగింపు

రేవంత్ సర్కార్ విన్నపానికి కేంద్రం ఆమోదం!



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీకాలంపై గత కొన్ని రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఆయన గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన రేవంత్ సర్కార్, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. ఆ గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగియనుండటంతో... ఆయన పదవీకాలాన్ని మరోసారి పొడిగించాలని ప్రభుత్వం మరోసారి కేంద్రానికి విన్నవించింది. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం, మరో మూడు నెలలు పొడిగించింది. రాష్ట్రంలో ప్రస్తుతం అనేక సంక్షేమ పథకాలు, ముఖ్యంగా 'రైతు భరోసా' నిధుల విడుదల (మార్చి 22), ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీల ప్రారంభం వంటి కీలక ఘట్టాలు జరుగుతున్న తరుణంలో సీఎస్ మార్పు సరికాదని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. రామకృష్ణారావుకు ఉన్న అనుభవం దృష్ట్యా ఆయన కొనసాగింపు ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చే అంశం.

## శ్రీరామనవమికి ముస్తాబవుతున్న ఆలయ పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్



**ఏటూరునాగారం / జైభీమ్ న్యూస్ :**

మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనమేరకు 20 లక్షల నిధులతో నిర్మాణం చేపడుతున్న ప్రహరీ గోడను పరిశీలన జాతర సమయానికల్లా అన్ని పనులు పూర్తి జాతర పనుల పై సమావేశం నిర్వహించి భక్తుల సౌకర్యాలు, భద్రత పండుగ వైభవంగా పెంపొందించేలా మార్గాల గురించి చర్చించారు శ్రీ రామనవమి పండుగ వైభవాన్ని పెంపొందించేందుకు కాంగ్రెస్ పార్టీ తరుపున అన్ని విధులుగా కృషి చేస్తాము ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్, సర్వ సాయి, చెన్నం ఎల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు, యువకులు, పెద్దలు, పత్రిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సారాయి కట్టడి... నల్లబెల్లం భారీగా పట్టివేత




**మహబూబాబాద్, 19 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

అక్రమ సారాయి తయారీపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టిన నేపథ్యంలో, జిల్లాలో భారీ స్థాయిలో నల్లబెల్లం పట్టుబడింది. టాస్క్ ఫోర్స్, కురవి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఈ విజయాన్ని సాధించారు. సమాచారం మేరకు, అక్రమ సారాయి తయారీలో వినియోగించే నల్లబెల్లాన్ని లారీ ద్వారా తరలిస్తున్నట్లు తెలిసి, పోలీసులు కురవి శివారు సోమ్లా తండా వద్ద వాహనాన్ని అడ్డగించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో లారీ లోపల సుమారు రూ.8 లక్షల విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం, 10 క్వింటాళ్ల పట్టిక బయటపడింది. వెంటనే పోలీసులు సరుకును స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేశారు. ఈ కేసులో గుగులోత్ సుమన్ (మహబూబాబాద్), ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ సీఐ హతీరామ్, ఎస్ఐ తాహేర్ బాబా, కురవి ఎస్ఐ గంద్రాతి సతీష్, ఎస్ఐ జయకుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది సమ్మయ్య, హరిబాబు, నరేష్, బద్రు, బాబు పాల్గొన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం, జిల్లాలో అక్రమ సారాయి తయారీ, రవాణాపై మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఆ విషయంలో హీరో సూర్య నుంచి స్ఫూర్తి పొందాను

మరో సేవా కార్యక్రమం చేపడతానన్న చిరంజీవి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలుగు సంవత్సరాది ఉగాది పండుగవేళ మెగాస్టార్ చిరంజీవి కీలక నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో పేద పిల్లలకు ఉచిత విద్య అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంకు, ఐ బ్యాంకు వంటి సేవా కార్యక్రమాలలో చిరంజీవి ముందున్నారు. ఈరోజు పండుగ సందర్భంగా ముమ్ముందు పేద పిల్లలకు ఉచిత విద్యకు సహకారం అందిస్తానని వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉచిత విద్యను అందించడమే తన లక్ష్యమని ఆయన వెల్లడించారు. కుటుంబంలో ఒక వ్యక్తి విద్యావంతుడు అయితే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందని అన్నారు. తమిళ నటుడు సూర్య ఇప్పటికే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పెట్టారని గుర్తు చేశారు. తాను ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పెట్టడానికి చిరంజీవి స్ఫూర్తి అని సూర్య పలుమార్లు చెప్పాడని తెలిపారు. సూర్య చేస్తున్న విద్యా సేవా కార్యక్రమాలు తనను ఆకర్షించాయని అన్నారు. సేవా కార్యక్రమాలకు సూర్యకు తాను స్ఫూర్తి అయితే, విద్యలో సేవా కార్యక్రమాలకు ఆయన తనకు స్ఫూర్తి అని చిరంజీవి పేర్కొన్నారు. విద్యా సేవా కార్యక్రమాలకు సంబంధించి సూర్య నుంచి నమూనాను తీసుకుని, రెండు తెలుగు రాష్ట్రాలలో భవిష్యత్తులో ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు.

## కొత్తగూడెం జిల్లాలో రూ.52 లక్షల విలువైన గంజాయి పట్టివేత

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ పోలీసులు రూ.52 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండల కేంద్రంలో పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన పలువురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుమారు 105.54 కిలోల గంజాయిని కార్లలో గుర్తించారు. వాహనంలో గంజాయి తరలిస్తున్నరనే పక్కా సమాచారంతో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో రెండు కార్లలో గంజాయి పట్టుబడింది. టీఎస్11 ఈఆర్ 6312, టీఎస్07 జేవై 3959 అనే నెంబర్లతో కూడిన రెండు కార్లను పోలీసులు ఆపారు. ఆ కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఈ గంజాయిని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలించి విక్రయించాలని ప్రయత్నించినట్లు తెలిపారు. అరెస్టైన ముగ్గురిని నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంకు చెందిన అందేకర్ శ్రీనివాస్ (40)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభి, లక్ష్మణ్, ఫరూక్ అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.



జై భీమ్
POWER OF PEOPLE



# అనుష్క పెళ్లి వార్తలపై 'టీమ్ అనుష్క' స్పందన..


### ఆమె వయసు గురించి చర్చపై ఫైర్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి వివాహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న వార్తలపై ఆమె వ్యక్తిగత బృందం 'టీమ్ అనుష్క' తీవ్రంగా స్పందించింది. ఒక వ్యాపారవేత్తతో అనుష్క పెళ్లి ఖాయమైందంటూ వస్తున్న కథనాలను ఖండిస్తూ, మీడియా సంస్థల తీరుపై మండిపడింది. కేవలం వ్యూస్, క్లిక్స్ కోసం ఒక నటి వ్యక్తిగత జీవితాన్ని బజారున పడేయడం సరికాదని హితవు పలికింది. తాజా ప్రకటనలో టీమ్ అనుష్క ప్రధానంగా వయసు అంశాన్ని ప్రస్తావించింది. ప్రతి వార్తలోనూ అనుష్క వయసు '44 ఏళ్లు' అని ప్రత్యేకంగా హైలైట్ చేస్తూ చర్చించడాన్ని తప్పుబట్టింది. "వయసు అనేది నిజంగా చర్చించాల్సిన సమస్య అయితే, ఇదే ఉత్సాహం సీనియర్ హీరోల వయసు విషయంలో ఎందుకు కనిపించదు? కేవలం మహిళా నటీమణులనే టార్గెట్ చేయడం వివక్ష కాదా?" అని ఘాటుగా ప్రశ్నించింది. అనుష్క తన సినీ కెరీర్‌ను కేవలం కష్టం, ప్రతిభతోనే నిర్మించుకున్నారని, ఆమె ఎప్పుడూ చీప్ పబ్లిసిటీ కోసం ప్రయత్నించలేదని టీమ్ గుర్తు చేసింది. ఒక నటిగా ఆమె సాధించిన విజయాలను పక్కన పెట్టి, కేవలం పెళ్లి, వయసు వంటి అంశాలనే హైలైట్ చేయడం అన్యాయమని పేర్కొంది. "వివాహం అనేది ఒక వ్యక్తిగత విషయం, అది బ్రేకింగ్ న్యూస్ కాదు. సోషల్ మీడియా ట్రెండ్ అసలే కాదు" అని స్పష్టం చేస్తూ, ఆమె వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం అనుష్క తన తదుపరి సినిమాలతో బిజీగా ఉన్నారని, ఆమె వివాహానికి సంబంధించిన ఏ చిన్న విషయమైనా తామే అధికారికంగా వెల్లడిస్తామని టీమ్ ప్రకటించింది. అప్పటివరకు నిరాధారమైన వార్తలను, సోషల్ మీడియా ఊహాగానాలను నమ్మవద్దని అభిమానులకు సూచించింది. సినిమా ఇండస్ట్రీలో హీరోలకు ఇచ్చే గౌరవాన్ని హీరోయిన్లకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేసిన ఈ ప్రకటన ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

# 'ఉస్తాద్'కు పాజిటివ్ టాక్... పవన్ కల్యాణ్ ను కలిసిన చిత్రయూనిట్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఉగాది పర్వదినం సందర్భంగా నేడు (మార్చి 19) థియేటర్లలో విడుదలైంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు తొలి షో నుంచే పాజిటివ్ టాక్ రావడంతో చిత్ర యూనిట్ సంబరాల్లో మునిగిపోయింది. సినిమాకు వస్తున్న అద్భుతమైన స్పందనతో చిత్ర బృందం ఆనందంతో ఉప్పొంగిపోతోంది. ఈ సక్సెస్ ఆనందంలో చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ హీరో పవన్ కల్యాణ్‌ను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. సినిమాకు లభిస్తున్న స్పందన గురించి పవన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించిన చిత్ర బృందాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు. సినిమాకు హిట్ టాక్ రావడంతో హైదరాబాద్‌లో నిర్మాతలు సక్సెస్ మీట్ కూడా ఏర్పాటు చేశారు.




# 'ది బ్లాక్ గోల్డ్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంయుక్త మీనన్

నటి సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్' షూటింగ్ శరవేగంగా తుది దశకు చేరుకుంది. యోగేశ్ కేఎంసీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ ఏడాది జూన్ లేదా జూలైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత రాజేశ్ దండా వెల్లడించారు. ఇటీవల ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన సినిమా విశేషాలు పంచుకున్నారు. "గన్ పట్టుకున్న పోలీస్ ఆఫీసర్‌కు, గన్ మాత్రమే వాడే విలన్‌కు మధ్య జరిగే కథ ఇది. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్నాం. సంయుక్త కెరీర్‌లో ఇది చాలా కొత్త తరహా పాత్ర అవుతుంది" అని ఆయన వివరించారు. సినిమాకు సంబంధించి ఇంకా ఐదు రోజుల టాకీ పార్ట్ మాత్రమే మిగిలి ఉందని, పోస్ట్-ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్, ఫియర్స్ కాప్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేసిన ఆమె పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. హాస్య మూవీస్, మగంటి పిక్చర్స్ పతాకాలపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్, మనీష్ వాధ్వా, రాంకీ వంటి భారీ తారాగణం నటిస్తోంది. రొటీన్ యాక్షన్ డ్రామాలకు భిన్నంగా, సరికొత్త కథనం, ఊహించని మలుపులతో ఈ సినిమా ఉండనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.